క్లుప్తంగా

పంచప్రాధాన్య లక్ష్యాలు నెరవేర్చాలి



సింగరాయకొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పంచ ప్రాధాన్య లక్ష్యాలను నెరవేర్చడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో జయమణి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఉపాధి సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో జయమణి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పనులలో మొదటి ప్రాధాన్యతగా పశువుల నీటితొట్ల నిర్మాణం, చెరువుల అభివృద్ధి, రైతు వారీ కుంటల నిర్మాణం, పంట కాలువల అభివృద్ధితో పాటు కూలీలకు రూ.300 తగ్గకుండా పని కల్పించాలని సూచించారు. ఏపీవో సుభాషిణి, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఘనంగా ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం



మర్రిపూడి: మండల కేంద్రం మర్రిపూడి జనరల్ ప్రాథమిక పాఠశాలలో 102వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు కే పద్మజ మాట్లాడుతూ ఏండ్ల చరిత్ర కలిగిన ఈ ప్రాథమిక పాఠశాల (జనరల్) ఇలాంటి కార్యక్రమాలు జరుపుకోవడం తల్లిదండ్రులకు పండుగ వాతావరణం నెలకొందన్నారు. కార్యక్రమంలో ఆర్ వెంకటేశ్వర్లు, సుబ్బారావు, బీఎల్ఎన్ శాస్త్రి, బీఎల్ఎన్ లీలావతి, పీఎంసీ చైర్మన్ నరసయ్య, వైస్ చైర్మన్ కోటేశ్వరి, రాజ్యలక్ష్మి, సుదేష్ణలు పాల్గొన్నారు.

ఉపాధి పనులకు నిధుల మంజూరు

కొండపి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వ్యవసాయ అనుబంధ పనులకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరైనట్లు ఎంపీడీవో రామాంజనేయులు శుక్రవారంఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 2025-26వ సంవత్సరానికి వచ్చే మూడు నెలల్లో 30 పశువుల నీటి తొట్లు, 285 పొలాల్లో పంట కుంటలు పంచాయతీకి 15 చొప్పున మంజూరైనట్లు తెలిపారు. పంట కాలువలు పూడికతీత కొత్త పంట కాలువలు తీయడం, 100 కిలో మీటర్లు, ఇరిగేషన్ చెరువులో పూడిక తీసే పనులు చేపట్టడం చేస్తారన్నారు.

ఆర్టీసీ ఆదాయానికి ప్రత్యేక ప్రణాళిక

కనిగిరిరూరల్: ఆర్టీసీ డిపో ఆదాయానికి సమష్టిగా పనిచేసి అభివృద్ధి చేద్దామని డీఎం ఎస్‌కే మహమ్మద్ సయనా బేగం అన్నారు. స్థానిక కనిగిరి డిపో ఆవరణలో శుక్రవారం ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లతో కేఎంపీఎల్ సాధన కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం డీఎం సయాన బేగం మాట్లాడుతూ వివిధ రూట్లల్లో తిరిగే డ్రైవర్లు, కండక్టర్లు సంస్థ పట్ల విధేయత, బాధ్యతగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎం ఎఫ్ ప్రసాద్, కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్‌లు సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వచేసిన బాణసంచా స్వాధీనం

కనిగిరిరూరల్: పట్టణంలోని ఓ ఫ్యాన్సీ షాపులో అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన బాణాసంచాను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. స్థానిక నాజ్ సెంటర్ సమీపంలో గల ఎమ్మెస్సార్ రోడ్డులోని మురళీకృష్ణ ఫ్యాన్సీ షాపులో అనుమతి లేకుండా నిల్వ ఉంచిన దీపావళీ సామగ్రిని సుమారు రూ.30 వేల విలువ చేసే సరుకును ఎస్సై టీ శ్రీరాం తన సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నారు. ఈమేరకు దుకాణంను సీజ్ చేసినట్లు తెలిపారు.

పట్టణ సుందరీకరణకు సహకరించాలి

కనిగిరిరూరల్: పట్టణ సుందరీకరణకు అందరూ సహకరించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, కమిషనర్ డానియేల్ జోసఫ్ అన్నారు. పట్టణంలోని పామూరు బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం రహదారికి ఇరువైపులా డివైడర్లకు మొక్కల కుండీలు ఏర్పాటు చేశారు. పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

టంగుటూరు: మండలంలోని తూర్పునాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బంగారు బాల్యంలో భాగంగా పాఠశాలలో బాలికలకు హెచ్‌ఎం సుధారాణి అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టంగుటూరు పోలీస్ స్టేషన్ ఏఎస్‌ఐ చంద్రలీల పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సార్స్ సిబ్బంది, పాఠశాల సిబ్బంది, సురేష్ రెడ్డి, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.



టంగుటూరు-వెంకటాయపాలెం రోడ్డులో తేలిన రాళ్లు



టంగుటూరు సెంటర్‌లో బాగున్న రోడ్డుకు ప్యాచ్ పనులు చేసిన దృశ్యం

పైపైన మెరుగులు.. లోలోపల బిల్లులు

- అధ్వాన రోడ్లను వదిలేసిన వైనం
- బాగున్న రోడ్డు మీద ప్యాచ్‌లు వేసిన దుస్థితి
- బిల్లులు చేసుకుంటున్న కాంట్రాక్టర్‌లు, అధికారులు

టంగుటూరు: చెప్పేదొకటి చేసేదొకటి.. ఏమాత్రం ఒక పొంతన ఉండదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలైనా ఎక్కడి వేసిన గొంగడి అక్కడే తయారైంది. సంక్రాంతి పాయే.. ఉగాది కూడా పోయే కాని ఊరుకు వెళ్లే రోడ్డు మాత్రం బాగుపడటం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంతలు పూడ్చి అద్దంలా ఉండే రహదారులను ఏర్పాటు చేస్తున్నాం.. పాలు కింద పడినా ఎత్తుకోవచ్చు' అని ప్రగల్భాలు పలికారు పచ్చనేతలు. మండల కేంద్రంలోని టంగుటూరు ఫ్లైఓవర్ నుంచి బొమ్మల సెంటర్ వరకు ఆర్ అండ్ బీ రోడ్డే ఇందుకు నిదర్శనం. దారంతా గుంతలమయంగా ఉంది. భారీ వాహనాలు, బస్సులు, ఆటోలు వెళ్తుండటంతో భారీగా దుమ్ము లేస్తోంది. ఈసమయంలో ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే టంగుటూరు-వెంకటాయపాలెం రోడ్డు, వెంకటాయపాలెం నుంచి వెలగపూడి రోడ్లు మరీ అధ్వానంగా ఉంది. కాని ఆర్‌అండ్‌బీ అధికారుల మాత్రం నెలకు ఒకసారి గుంతలు పూడ్చి



టంగుటూరు ఫ్లైఓవర్ సమీపంలో బస్సు వెనుక వస్తున్న దుమ్ము

బిల్లులు చేసుకొని జేబులు నింపుకుంటున్నారే తప్పా శాశ్వత పరిష్కారం చూపడం లేదు.

బాగున్న రోడ్లకు అప్రోచ్, ప్యాచ్ పనులు..

తహసీల్దార్ కార్యాలయం నుంచి జయవరం వరకు, ఆర్టీసీ డిపో నుంచి నుంచి ఫైర్ స్టేషన్ వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డుకు రోడ్లకు అప్రోచ్, ప్యాచ్ పనులు తూతూమాత్రంగా నిర్వహించారు. రూ. 5 లక్షలతో కాంట్రాక్టర్లు, ఆర్‌అండ్‌బీ అధికారుల జేబులు నింపుకున్నారు. నిత్యం టంగుటూరు సెంటర్ నుంచి కొండపి వైపు వేల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. దుమ్ము లేచి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే అవసరం లేకుండా అటు అప్రోచ్ రోడ్లు, ఇటు ప్యాచ్ పనులు నిర్వహించారు. సిమెంటు రోడ్డుపై తారుతో ప్యాచ్ పనులు చేశారు. ఇకనైనా ఆర్‌అండ్‌బీ అధికారులు కమీషన్లకు కక్కుర్తి పడకుండా అవసరమైన రోడ్లను పూర్తిచేసేలా చొరవ చూపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ ఏఈని వివరణ కోరగా కొండపి మండలంలో పలు రోడ్లు నిర్మిస్తున్నాం. అవి అయి పోగానే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు.



దుమ్ము, ధూళితో ఇబ్బంది పడుతున్నాం..

తహసీల్దార్ సమీపంలోని జాతీయ రహదారి ఫ్లైఓవర్ నుంచి టంగుటూరు సెంటర్ వరకు రోడ్డుపై రాళ్లు లేచి ఉండటం వల్ల పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటితో పాటు రోడ్డుపై పేరుకుపోయిన దుమ్ము, ధూళి పైకి లేచి ఎదురుగా వచ్చే వాహనం కనపడక గాయాలు కూడా అయ్యాయి. అధికారులు చొరవ తీసుకోవాలి.

– చింతపల్లి హరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు



పట్టించుకునే నాథుడే లేరు..

టంగుటూరు-వెంకటాయపాలెం రోడ్డుకు గుంతలు పూడ్చటానికి రాళ్లు, డస్టు తోలి వదిలేశారు. దీంతో ఎస్సీ కాలనీ వాసుల ఇళ్లలోకి, తినే కంచంలోకి దుమ్ము, ధూళి పడుతోంది. అన్నం ఎలా తినాలో అర్థం కావడం లేదు. రాత్రి సమయంలో ఏ వాహనం వచ్చి ఢీకొడుతుందో భయపడుతున్నాం.

– కొమ్ము ప్రభుదాసు, టంగుటూరు ఎంపీటీసీ

పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటాం



సర్పంచ్ బాలకృష్ణ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న దద్దాల, పార్టీ నేతలు



గురుబ్రహ్మం కుటుంబానికి సాయం అందజేస్తున్న దద్దాల, తిరుపతిరెడ్డి

వెలిగండ్ల(కనిగిరిరూరల్): అనారోగ్య కారణాలతో పార్టీ నాయకులు, కార్యకర్తలను కోల్పోవడం బాధాకరమని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పేర్కొన్నారు. బెంగళూరులో మృతి చెందిన సర్పంచ్ తోకల బాలకృష్ణ భౌతిక కాయాన్ని స్వగ్రామమైన మండలంలోని ఇమ్మడి చెరువుకు తీసుకొచ్చారు. ఈమేరకు శుక్రవారం బాలకృష్ణ భౌతిక కాయాన్ని దద్దాల నారాయణ యాదవ్ సందర్శించి నివాళులర్పించారు.

కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం..

మండలంలోని పందువ నాగులవరం గుమ్మల కర్ర హరిజన కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త వేల్పుల గురుబ్రహ్మం భౌతిక కాయాన్ని దద్దాల సందర్శించి నివాళులర్పించారు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. పార్టీ వారికి అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీల సంఘం అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గజ్జల తిరుపతిరెడ్డి, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కటికల వెంకట రత్నం, పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, నాగూర్ యాదవ్, కొల్లా సుబ్రహ్మణ్యం, కాకర్ల వెంకటేశ్వర్లు, ఎలికా రమణయ్య, ఆవుల తిరుపతిరెడ్డి, ఏటీఆర్, వాకుమళ్ల రాజశేఖరరెడ్డి, గూడూరి అనీల్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుతు తాతపుడి సురేష్, గోనా జేమ్స్, రామన భాస్కర్‌రెడ్డి, గోడి నారాయణ రెడ్డి, ఎంపీటీసీ గురవయ్య, కుప్పన బోయిన వెంకట రామయ్య, తమ్మినేని శివరామిరెడ్డి, రాయళ్ల బ్రదర్స్, మర్రి వెంకట నారాయణ, కారుమంచి బాల సిద్ధయ్య, కొల్లి బోయిన పెద్ద గురవయ్య, కేసరి వెంకటరెడ్డి, దమ్ము లక్ష్మీ కుమారి, ముక్కు వెంకటేశ్వరరెడ్డి, ముక్కు రామయ్య, చిట్టి నాయుడు, పాలా రమేష్, సానికొమ్ము నారాయణ, ముక్కు గోపాల్ రెడ్డి, శ్యామల ప్రసాద్‌రెడ్డి, చెన్న కృష్ణాయ్య, చిన్న పీరయ్య, ఈర్ల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు తీరని ద్రోహం చేసిన టీడీపీ, జనసేన

పామూరు: పార్లమెంట్ ఉభయసభల్లో వక్ఫ్ బిల్లు ఆమోదం పొందేలాగా బిల్లుకు మద్దతునిచ్చి ముస్లింలకు టీడీపీ, జనసేన పార్టీలు తీరని ద్రోహం చేశాయని సీపీఎం మండల కార్యదర్శి షేక్.ఖాదర్‌బాషా మండిపడ్డారు. వక్ఫ్‌బోర్డ్ సవరణ బిల్లును నిరసిస్తూ శుక్రవారం సాయంత్రం స్థానిక పెద్దమసీద్ సెంటర్‌లో పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేశారు. ఈసందర్భంగా ఖాదర్‌బాషా మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 25, 29, 30లను కాలరాస్తూ, వక్ఫ్ ఆస్తులు వక్ఫ్ బోర్డుకే సొంతమని, ప్రభుత్వ జోక్యం ఉండకూడదని గతంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పునుకూడా బీజేపీ ప్రభుత్వం తుంగలో తొక్కారన్నారు. ప్రధాని మోదీ కళ్లతో ఆనందం చూసేందుకు నాడు ఎన్నికలకు ముందు ముస్లింలకు ఇచ్చిన హామీని సైతం విస్మరించి కూటమి బిల్లుకు బీజేపీకి మద్దతుగా నిలిచాయన్నారు. దీనిని నిరసిస్తూ ముస్లింలు పెద్ద ఎత్తున్న ఉద్యమించాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సయ్యద్ గౌస్‌బాషా, షేక్.అల్లాబక్షు, మస్తాన్, ఇస్మాయిల్, మాల్యాద్రి ముస్లింలు పాల్గొన్నారు.



సీఎస్‌పురంలో మసీదు వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం, ముస్లిం నాయకులు

ముస్లింల నిరసన

సీఎస్‌పురం (పామూరు): మండల కేంద్రం సీఎస్‌పురంలో సీపీఎం ఆధ్వర్యంలో మసీదు వద్ద ముస్లింలు, సీపీయం నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు ఊసా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముస్లిం ప్రజలపై విద్వేషాన్ని ప్రర్శిస్తోందన్నారు. వక్ఫ్ ఆస్తులను కొల్లగొట్టేందుకు ఈచర్యకు కేంద్రం ఉపక్రమించిందని తగిన గుణపాఠం చెప్తామన్నారు.

పొగాకు వేలం కేంద్రంలో 180 బేళ్ల తిరస్కరణ

కొండపి/టంగుటూరు: రెండు పొగాకు వేలం కేంద్రాల్లో 180 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కొండపి వేలం కేంద్రంలో శుక్రవారం 99 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయని వేలం నిర్వహణ అధికారి జీ సునీల్‌కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని చవటపాలెం, దాదానాయుడుపాలెం, రామాయపాలెం, కొండపి, దాసిరెడ్డిపాలెం, పోలిరెడ్డిపాలెం గ్రామాలకు చెందిన రైతులు వేలానికి 491 బేళ్లను తీసుకురాగా 392 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 99 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ.280, కనిష్ట ధర కేజీ రూ.240, సరాసరి ధర కేజీ రూ.257.47గా నమోదైంది. వేలంలో 15 కంపెనీలు చెందిన వ్యాపారులు పాల్గొన్నారు.



కొండపిలో వేలం నిర్వహిస్తున్న నిర్వహణాధికారి

81 బేళ్లు తిరస్కరణ..

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వేలంలో 81 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయని వేలం నిర్వహణ అధికారి ఏ. శ్రీనివాసరావు తెలిపారు. క్లస్టర్ పరిధిలోని కారుమంచి గ్రామాలకు చెందిన రైతులు వేలానికి 445 బేళ్లను తీసుకురాగా 364 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 81 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ.280, కనిష్ట ధర కేజీ రూ.240, సరాసరి ధర కేజీ రూ.266.44గా నమోదైంది. వేలంలో 12 కంపెనీలు చెందిన వ్యాపారులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి స్పోర్ట్స్ మీట్‌కు విద్యార్థులు

సీఎస్‌పురం (పామూరు): జాతీయస్థాయి స్పోర్ట్స్ మీట్‌కు కేబీఆర్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈసందర్భంగా శుక్రవారం కళాశాలలో క్రీడాకారులను యాజమాన్యం అభినందించింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి వ్యవసాయ కళాశాలల క్రీడాపోటీల్లో ప్రథమ స్థానంలో రాణించి జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైన విద్యార్థులు కే.యమున, మునయ్య, ఎస్.సుదేవ్‌లను సీపీ, కరస్పాండెంట్ కదిరి పార్థసారథి అభినందించారు. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం అయోధ్యలో మే 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు జరిగే ఆల్ ఇండియా వ్యవసాయ విశ్వవిద్యాలయ క్రీడాపోటీల్లో పాల్గొననున్నారని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ పి.వీరన్నగౌడ్, కేవీఎస్ఎల్ ప్లస్ కళాశాల చైర్మన్ ఇరగతి చలపతిరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ సుస్మిత, పీడీ బండారు రవీంద్రబాబు, డి.మాలకొండయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న పార్థసారథి

ఉపాధి పనుల్లో దొంగ మస్టర్లు వేస్తున్నారు

పొన్నలూరు: మండల సర్వసభ్య సమావేశం వాడీ వేడిగా జరిగింది. స్థానిక ఎంపీడీఓ కార్యలయంలో ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. పొన్నలూరులో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో దొంగ మస్టర్లు వేసి కూలీల సొమ్మును స్వాహా చేస్తున్నారని జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు ఏపీవోని నిలదీశారు. మంచంలో ఉన్న వృద్ధులు, గ్రామంలో లేని వారికి, ఉదయాన్నే పొగాకు పనులకు వెళ్లే వారి పేర్లు మీద ఉపాధి హామీ పనులకు వెళ్లినట్లు మస్టర్లు వేస్తూ డబ్బులు కాజేస్తున్నారని ప్రశ్నించారు. ఉపాధి పనుల దగ్గరకు ఫీల్డ్ అసిస్టెంట్ వెళ్లకుండా వేరే వ్యక్తులను పంపిస్తూ కూలీలు దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నారన్నారని ఆధారాలు ఎంపీడీవోకి సమర్పించారు. అలాగే తమ గ్రామంలోని కిరాణా షాపుల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు ఏర్పాటు చేసి అక్రమంగా మద్యం సీసాలు అమ్మిస్తున్నారని, దీని ద్వారా గ్రామంలో తాగి గొడవలు జరుగుతున్నాయని శింగరబొట్లపాలెం సర్పంచ్ పెరికా రమేష్ సభ దృష్టికి తీసుకొచ్చారు. ఉప్పలదిన్నె గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని, బస్సు సర్వీసు లేకపోవడం వలన గ్రామస్తులు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారని ఎన్ని సార్లు అడిగినా ఆర్టీసీ వారు పట్టించుకోవడం లేదని సర్పంచ్ మన్నెం పద్మావతి ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుజాత, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



దొంగ మస్టర్లు వేస్తున్నారని ఏపీవోని నిలదీస్తున్న జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

హనుమంతునిపాడు: పరిసరాల పరిశుభ్రతతోనే అంటు వ్యాధులు దూరమవుతాయని మెడికల్ ఆఫీసర్ దార్ల సందీప్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధి కొండారెడ్డిపల్లిలో ఫ్రైడే, డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా దోమల నివారణ చర్యలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ అధికారి రామాంజనేయులు, డీపీఎంవో కోటపాటి ప్రసాద్‌రెడ్డిలు, మెడికల్ అధికారి సందీప్‌లు మాట్లాడుతూ దోమ కాటు వలన మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, మెదడువాపు, బోదకాలు వంటి వ్యాధులు సోకుతాయన్నారు. దోమను ల్యార్వ దశలోనే నివారించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు సందీప్, లక్ష్మీ భార్గవి, సీహెచ్‌ఓ చెన్నయ్య, ఆరోగ్య సిబ్బంది, దొరసానమ్మ, నాగరాజు, సూపర్‌వైజర్లు, ఎఎన్‌ఎంలు, ఆశలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న మలేరియా నివారణ అధికారులు

ఏప్రిల్ 7 నుంచి ఇంటర్ అడ్మిషన్‌లు

పీసీపల్లి: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లు ఏప్రిల్ నుంచి ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విజయ శంకర్ తెలిపారు. శుక్రవారం జూనియర్ కళాశాల అధ్యాపకులు అడ్మిషన్‌ల కోసం క్యాంపెయిన్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలేజీలో ఎంపీసీ, ఎంఈసీ ఇంగ్లిష్ మీడియం గ్రూప్‌లు ఉన్నాయని తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని.. మెరుగైన బోధన చేస్తున్నారని చెప్పారు. 2025-26 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల పీసీపల్లి సెకండియర్ విద్యార్థుల కోసం క్లాసులు ప్రారంభిస్తున్నామని చెప్పారు. అందరికీ అందుబాటులో ఉన్న పీసీపల్లి జూనియర్ కాలేజీలో అందరూ చేరి కాలేజీని నిలబెట్టేందుకు కృషి చేయాలని అధ్యాపకులు కోరుతున్నారు.



కాలేజీలో చేరమని విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న అధ్యాపకులు

పనిచేయని అధికారులపై చర్యలు

సీఎస్‌పురం(పామూరు): బాధ్యతాయుతంగా పని చేయని అధికారులపై చర్యలకు వెనుకాడేదిలేదని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో శుక్రవారం ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా బోయమడుగుల ఎంపీటీసీ బైరెడ్డి తిరుపతిరెడ్డి, సీఎస్‌పురం ఉపసర్పంచ్ పాములపాటి వెంకట నర్సయ్య, అరివేముల ఎంపీటీసీ బొమ్మన వెంకటేశ్వర్లు, సీఎస్‌పురం ఎంపీటీసీలు మన్నేపల్లి వెంకట సుబ్బమ్మ, బత్తుల రమాదేవిలు మాట్లాడుతూ విద్యుత్‌లైన్లు అసంపూర్తిగా ఉన్నాయని, ఎక్కడా పనులు పూర్తి కాలేదన్నారు. అదేవిధంగా చెన్నపునాయునిపల్లె సచివాలయం పూర్తి చేయించాలని, కొత్తపల్లె సచివాలయానికి విద్యుత్ సౌకర్యం కల్పించి ప్రారంభించాలని ఎంపీటీసీలు కోరారు. నీటి సమస్య పరిష్కరించాలని, ఇంటింటికి కొళాయి ఊసేలేదని సీఎస్‌పురం ఎంపీటీసీలు మన్నేపల్లి వెంకటసుబ్బమ్మ, ఎం.రాములమ్మ, పలువురు ఎంపీటీసీలు చెప్పగా మండలంలో ఎక్కడా తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీపీ ఏఈ మోహన్‌కు సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ కే.శ్రీనివాస రెడ్డి, ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య, వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, భూమిరెడ్డి ప్రభంజన, షీప్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు తోడేటి గోపి, డీటీ పి.వెంకటేశ్వర్లు, ఎంఈఓలు ప్రసాదరావు, కొండారెడ్డి, ఏఓ సంపత్‌కుమార్, డాక్టర్ మహేష్, ఏపీఓ శ్రీనివాసనాయక్, సర్పంచ్‌లు బొట్లా చిరంజీవి, హౌసింగ్ ఏఈ పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర, పక్కన ఎంపీపీ మూడమంచు

రీ సర్వేకు రైతులు సహకరించాలి

టంగుటూరు: రీ సర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ ఆంజనేయులు అన్నారు. మండలంలోని వాసేపల్లిపాడు గ్రామంలో శుక్రవారం తహసీల్దార్ ఆంజనేయులు ఆధ్వర్యంలో రీసర్వేపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరూ భూములకు సంబంధించిన వివరాలను ఆధార్, ఫోన్ నంబర్, ఫోటోతో తమ భూముల గట్లు చూపించి రీ సర్వే టీంతో సహకరించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టులో భాగంగా రెండో దశలో పైలట్ గ్రామంలో మండలంలోని వాసేపల్లిపాడు గ్రామాన్ని ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ మాధవి, ఆర్ఐ హనుమంతరావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పొన్నలూరు: మండలంలోని శింగరబొట్లపాలెం, గూడావారికండ్రిక గ్రామాల్లో శుక్రవారం భూముల రీసర్వేపై ర్యాలీ నిర్వహించి రైతులకు రెవెన్యూ అధికారులు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్ స్రవంతి మాట్లాడుతూ రీ సర్వే ద్వారా భూముల విస్తీర్ణంలోని తేడాలను గుర్తించి కచ్చితమైన భూమిని ఏర్పాటు చేయవచ్చన్నారు. రైతులు రీ సర్వేకు సహకరించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ వెంకటేశ్వరరావు, వీఆర్వో రేవంత్, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రీ సర్వే డీటీ మాధవి